క్లుప్తంగా

రమేశ్‌కు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కుడుతల రమేశ్ ఫొటోగ్రఫీలో రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. కాగా రమేశ్ వరుసగా ఏడోసారి అవార్డు అందుకోవడం విశేషం. దీంతో మండలానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

నానో ఎరువులు వినియోగించాలి

నల్లబెల్లి : రైతులు నానో ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి బన్న రజిత సూచించారు. మండలంలోని ముచ్చింపులతండా పంచాయతీలో సోమవారం నిర్వహించిన 'ఏరువాక సాగుబడి' సమావేశంలో ఆమె మాట్లాడారు. భూసార పరిరక్షణ కోసం యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ వినియోగించాలని చెప్పారు. పంటల సాగులో వస్తున్న నూతన ఒరవడులను రైతులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు ప్రభుత్వం ఎరువులు అందిస్తోందని వివరించారు. రైతులు ఎరువుల, విత్తనాల, పురుగు మందుల బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏఈఓ శివకుమార్, రైతులు సాంబయ్య, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటల దశకు అనుగుణంగా యూరియా

ఖానాపురం : ప్రభుత్వం పంటల దశలకు అనుగుణంగా యూరియా అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కొడ్తిమాటుతండాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ ఎరువులను పంటలపై అధికంగా వినియోగించవద్దని చెప్పారు. భూములు చౌడుబారే ప్రమాదం ఉందన్నారు. ద్రవరూపంలో లభిస్తున్న నానోప్లస్ యూరియాను పంటలపై స్ప్రేయర్లు, డ్రోన్ల ద్వారా పిచికారీ చేయాలని తెలిపారు. యూరియా సరఫరా ప్రణాళికాయుతంగా సాగుతోందని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం వైపు చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ అంకుషా వలీ, పంచాయతీ కార్యదర్శి దివ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సంగెం : భారీ వర్షాలతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై నరేశ్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎల్గూర్ రంగంపేట చెరువు మత్తడి పోస్తున్న క్రమంలో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు మానుకోవాలని సూచించారు. రోడ్లకు అడ్డంగా ఉన్న మత్తళ్లు, వాగులు, లో లెవల్ కాజ్‌వేల మీద నీటి ఉధృతిని గమనించకుండా ఒంటరిగా ప్రయాణించొద్దని పేర్కొన్నారు. ఎల్గూర్ రంగంపేట మత్తడి ఉధృతి నేపథ్యంలో రాకపోకలు నిలిపేశామని స్పష్టం చేశారు. ప్రజలు ఇతర మార్గాల మీదుగా ప్రయణించాలని తెలిపారు. శిథిలమైన ఇళ్లల్లో నివాసం ఉండొద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, ఆపదలో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సంగెం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు కోరారు. మండలంలోని నల్లబెల్లి, బాలునాయక్ తండా, నార్లవాయి, ముమ్మడివరం, గొల్లపల్లి, మొండ్రాయి, పల్లారుగూడ, వంజరపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసి 20 నెలలు గడుస్తుండగా గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోందని.. అయినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడంలో నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలును అధికారంలోకి వచ్చాక విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి సమష్టి కృషితో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశాల్లో పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, కుమారస్వామి, గోవర్ధన్, సదానందం, మన్సూర్ అలీ, పురుషోత్తం, శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నర్సంపేట : మండలంలోని బోడ మాణిక్యం తండాకు చెందిన బోడ ఈర్యనాయక్‌కు మంజూరైన రూ.10 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయనకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సునాయక్ సోమవారం అందజేశారు. అనంతరం నర్సు నాయక్ మాట్లాడారు. ఎమ్మెల్యే చొరవతో సీఎంఆర్‌ఎఫ్ మంజూరైందని చెప్పారు.

గుంతలు పడి.. వరద నిలిచి

- ప్రమాదకరంగా కటాక్షపూర్ మత్తడిరోడ్డు
- భయాందోళనలో వాహనదారులు
- పూర్తికాని వంతెన నిర్మాణం
- పాలకులు, అధికారులపై విమర్శలు



గుంతలు పడి ప్రమాదకరంగా మారిన కటాక్షపూర్ మత్తడిరోడ్డు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడిరోడ్డు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు భయాందోళనకు గురౌవుతున్నారు. చెరువు మత్తడి 163 జాతీయ రహదారి గుండా వెళ్తుంది. అయితే అక్కడ వంతెన నిర్మాణం ప్రారంభయినప్పటికీ పనులు పూర్తికాలేదు. దీంతో వర్షాకాలం రవాణా కష్టాలు తప్పేలా లేవని వాహనదారులు వాపోతున్నారు. చెరువు మత్తడి జాతీయ రహదారిపై నుంచే ప్రవహిస్తుందని, రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టిసారించి గుంతలు పూడ్చి రోడ్డు ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో సోమవారం రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు సాంబయ్య, హంశాల్, కృష్ణంరాజు, వాసు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులుగా ఎదగాలి



కమలాపూర్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్ కుమార్

కమలాపూర్ : మహిళలు విద్యావంతులుగా ఎదగాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. ఉల్లాస్ న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమం మహిళకు వరంలాంటిదని, సద్వినియోగం చేసుకుని మహిళలు విద్యావంతులు కావాలన్నారు. అనంతరం ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా నిరక్షరాస్యులైన మహిళలు 2,742 మంది ఉన్నారని, వారందరికి ఆయా గ్రామ పంచాయతీల్లో 3 నెలల శిక్షణ కల్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. 3 నెలల శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు. ఆర్పీలు రవీందర్‌రెడ్డి, సువర్ణ, సీఆర్పీలు సుభాష్, శ్రీనివాస్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నాగేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వీఓలు, వీఏఓలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : వంద శాతం అక్షరాస్యత కలిగిన మండలంగా తీర్చిదిద్దాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన వాలంటీర్లకు సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరుగగా ఎంఈఓ డాక్టర్ రామ్ ధన్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ న్యూ ఇండియా లిటరసీ ప్రారంభించిందన్నారు. మండలంలోని వయోజనులంతా వార్తా పత్రికలు, పుస్తకాలు చదవగలిగే స్థాయికి ఎదిగేలా చూడాలని అన్నారు. సమన్వయ కర్తలుగా ఏపీఎం దేవానంద్, కాంప్లెక్స్ ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్, శ్యాంసుందర్, సురేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, వివిధ గ్రామాల ఉపాధ్యాయులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలో వందశాతం అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ న్యూ ఇండియా లిటరసీ లక్ష్యమని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంఈఓ చంద్రమౌళి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వీఓఏలకు, టీచర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం, పలు గ్రామాల వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కోకన్వీనర్ కొత్తూరు ఇంద్రసేన డిమాండ్ చేశారు. ఈనెల 24వ తేదీన వరంగల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల హత్యాకాండను నిరసిస్తూ ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి తక్షణమే పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కుల కోసం వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన బహిరంగ సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సారయ్య, భరత్, శ్రీనివాస్, రాజు, ప్రభాకర్, జగన్, భిక్షపతి పాల్గొన్నారు.

దామేశ్వరాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



ప్రత్యేకలంకరణలో స్వామివారు

దామెర : శ్రావణమాస సోమవారాన్ని సందర్భంగా మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు రాజుశర్మ వేద మంత్రోచ్చరణల నడుమ అర్చన, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈసీపై ఆరోపణలు మానుకోవాలి



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై చేస్తున్న నిరాధార ఆరోపణలు మానుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో సోమవారం ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరాధార ఆరోపణలు చేస్తూ దేశంలో అలజడులు సృష్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఆయన తీరుకు నిరసనగా దిష్టి బొమ్మను దహనం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రాజు, రవితేజ, విక్రమ్, జిల్లా నాయకులు కోటేశ్వర్‌రావు, మహేష్, భాస్కర్, రవీందర్‌రెడ్డి, వెంకటనారాయణ, ఆగారెడ్డి, మోహన్, శ్రీను, ఎల్లయ్య పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

శాయంపేట : భారీ వర్షాల కారణంగా విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ సూచించారు. తడి చేతులతో విద్యుత్ స్తంభాలు, పరికరాలను ముట్టుకోవద్దని, పడిపోయిన స్తంభాల విద్యుత్ తీగల దగ్గరకు వెళ్లొద్దని తెలిపారు. వాటర్ హీటర్, సెల్‌ఫోన్ చార్జర్ తీగలను చిన్న పిల్లలకు దూరంగా ఉంచాలని సూచించారు.

ఎమ్మెల్యే రేవూరి పరామర్శ



దామెర : మండలంలోని కోగిల్వాయికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డిని సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. జితేందర్‌రెడ్డి తండ్రి మాధవరెడ్డి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించారు. అలాగే హనుమకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పగడాల కాశీప్రసాదరావు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు.

అక్కంపేటలో మూడు గొర్రెలు చోరీ

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో జక్కుల లింగయ్య తన గొర్రెలను ఆదివారం రాత్రి ఇంటి వద్దనున్న పాకలో కట్టేశాడు. కాగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 3 గొర్రెలను అపహరించారని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

ఈనెల 15వ తేదీన పెంచికలపేటకు చెందిన కొలగాని శ్రీను తనపై కర్రతో దాడి చేసి గాయపరిచాడని రాదారపు కిషన్ సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దు చేసేవరకు పోరాటం



ధర్మసాగర్ : వాల్‌పోసర్లు ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు



ఆత్మకూరులో..

● పీఆర్టీయూ నాయకుల స్పష్టీకరణ

ధర్మసాగర్ : ఉద్యోగులను నష్టపరిచే విధంగా ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేవరకు పోరాటం ఆపేదిలేదని పీఆర్టీయూ (టీఎస్) మండల శాఖ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మహా ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాత పెన్షన్‌ను రద్దు చేసి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, అప్పటి నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు దాన్ని రద్దు చేయాలని కోరుతూ నిరసనలు చేపట్టాయని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికీ స్పందించపోవడం హేయమైన చర్య అన్నారు. సీపీఎస్ అంతం పీఆర్టీయూ పంతం నినాదంతో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద పీఆర్టీయూ(టీఎస్) ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆత్మకూరు : సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేలా పోరాటం చేయాలని పీఆర్టీయూ(టీఎస్) మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పీఆర్టీయూ బాధ్యులు ఉపేందర్‌రెడ్డి, నిర్మలకుమారి, సోమయ్య, అనురాధ, రాజు, దేవేందర్‌రెడ్డి, ఉషారాణి, కిరణ్ పాల్గొన్నారు.

శాయంపేట : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో సెప్టెంబర్ 1వ తేదిన పీఆర్టీయూ(టీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు యుగేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ రాథోడ్, మండల విద్యాశాఖ అధికారి భిక్షపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, రాజిరెడ్డి, సంధ్య, సురేందర్ పాల్గొన్నారు.

పెత్తందారులపై పోరాడిన యోధుడు పాపన్న



పరకాల : సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఎల్కతుర్తి : పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న గౌడ సంఘం నాయకులు



కమలాపూర్ : పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : కుల, మత, వర్గ భేదాలు లేకుండా అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొనియాడారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించగా ఆయన హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : పెత్తందారుల ఆగడాలను వ్యతిరేకించి పోరాడిన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని గౌడ సంఘం నాయకులు కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ తొలి రాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. గౌడ సంఘం నాయకులు రమేశ్ గౌడ్, అశోక్‌గౌడ్, డాక్టర్ సాంబయ్యగౌడ్, భిక్షపతి, రాజయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని భీమదేవరపల్లి మండలంతో పాటు ఎల్కతుర్తి మండలంలో గౌడ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. దొరలు, పెత్తందారుల ఆధిపత్యానికి, అణచివేతను వ్యతిరేకించి పోరాడిన వీరుడు సార్వాయి పాపన్న అని కొనియాడారు. నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని ఊరుగొండలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ముత్యాల అర్జున్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు సదానందం, రాము, రాజు, కిశోర్, విశ్వనాథం, కృష్ణ, నవీన్, పరుశరామ్, అన్వేష్, అరుణ్‌సాగర్, నటరాజ్, సమ్మయ్య, సృజన్, ఉమేష్, హరీష్, సైలాని తదితరులు పాల్గొన్నారు.



దామెర : ఊరుగొండలో..

ఐనవోలు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నందనం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని కల్లుగీత పారిశ్రామిక సహకారం సంఘం, కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని బీసీ వర్గాల్లోని అన్ని కుల సంఘాలు, వృత్తి సంఘాలు ఐక్యపోరాటాలు చేసి 42 శాతం రిజర్వేషన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కేజీకేఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌గౌడ్, నాగయ్య, సదానందం, స్వామి, అశోక్, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



బ్యాగులతో విద్యార్థులు, క్లబ్ ప్రతినిధులు

ఐనవోలు : లయన్స్ క్లబ్, ఆత్మీయ ప్రేమలత క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో 2024–2025లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. అలాగే 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు రూ.15 వేల విలువచేసే బ్యాగులను లయన్ కె.రాజేశ్వరి, (రిటైర్డ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్) పంపిణీ చేశారు. మండలంలోని పంథిని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ప్రతిభ కనబర్చిన ఏ.మనిశ్రీకి రూ.3 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎం.రక్షితకు రూ.2 వేల నగదుతో పాటు మరో 30 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. జిల్లా చీఫ్ సెక్రటరీ లయన్ మార్గం ప్రభాకర్, ప్రెసిడెంట్ లయన్ గండి సమ్మయ్య, ట్రెజరర్ లయన్ కేడల అనూష, ప్రతినిధులు రాంచందర్, విష్ణువర్ధన్, కృష్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ఉండాలి

● మెడికల్ ఆఫీసర్ మహేంద్రకుమార్



ల్యాదెళ్లలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దామెర : డెంగీ నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రకుమార్ అన్నారు. ల్యాదెళ్లలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ అనుమానితులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. జ్వరం సోకిన వ్యక్తులు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని అన్నారు. డెంగీ కేసులు పెరుగుతున్న తరుణంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డాక్టర్ రాధశాంతిప్రియ, హెచ్‌ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ల్యాబ్‌టెక్నీషన్ కృష్ణ, ఏఎన్ఎం భారతి, వనిత, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోడెను కట్టి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారంలో గల మహిమాన్విత శ్రీముఖ్యనాథస్వామి దేవాలయంలో కొడెను కట్టి మొక్కులు చెల్లిస్తే స్వామి అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం. శ్రావణమాసం చివరి సోమవారం అవడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కోడెను కట్టి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో వెలసిన స్వయంభూ శివలింగానికి ముడుపులు కట్టారు. ఆలయ పునర్ నిర్మాణ వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, ఆలయ కమిటీ డైరెక్టర్ నవీన్, అర్చకులు రాజుశాస్త్రీ, సునీల్ శాస్త్రీ, ఐలయ్య, నర్సింహరాములు, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.